

కథా కౌముది


# ఓట్ల కుక్కలు

డా.ఎస్.ఎ.వి.ప్రసాదరావు

''ప్రాణం పోయింది'' అన్నాడు హాస్పిటల్ గదిలోంచి బయటకు వస్తూ కాంతారావు.

పోయిన ప్రాణం వీర్రాజుది.

రెండు రోజులుగా హాస్పిటల్‌లో అనారోగ్యంతో పోరాడి చనిపోయాడు వీర్రాజు. కాంతారావు మాటలు వినగానే అక్కడున్న వీర్రాజు అనుచరులు, స్నేహితులు బంధువుల్లో నిశ్శబ్దం ఆవహించింది.

ప్రభుత్వ ఆసుపత్రికి వెనకే ఉండే గుణదల ప్రాంతానికి మాజీ కార్పొరేటరు వీర్రాజు. క్రితం ఎన్నికల్లో సుబ్బారావుని నిలబెట్టింది వాళ్ళ పార్టీ. సుబ్బారావు వీర్రాజు మద్దతుతోనే గెలిచాడు. మళ్ళీ పోటీకి సుబ్బారావు సిద్ధంగా ఉన్నాడు.

ఏ పార్టీకీ సంబంధం లేకుండా ఆ ప్రాంతంలో వీర్రాజు అజమాయిషీలో ఐదొందల ఓట్లు ఉన్నాయి. అంతా ఒక మాట మీద ఉంటారు. ప్రతి ఎన్నికలలోనూ ఏ యే పార్టీల వద్ద ఓటుకి ఎంతెంత డబ్బు డిమాండ్ చేయాలి, ఎంత తీసుకోవాలి, ఎవరికి ఓటు వేయాలనేది వీర్రాజే నిర్ణయిస్తాడు. ఐదొందల మందీ శిరసావహిస్తారు.

క్రితం ఎన్నికలలో సుబ్బారావు ఓటుకి ఐదొందలు ఇచ్చాడు. చివరి రోజుకి ముందు రోజు దాక అంతా బాగానే వుంది. అవతల పార్టీ వాడు వచ్చి వెయ్యి పంచేశాడు. అదీ తీసుకున్నారు. విషయం తెలిసి సుబ్బారావు వీర్రాజు దగ్గరికి పరిగెత్తుకొచ్చాడు. ''నువ్వు ఇంకో వెయ్యి కొట్టన్నా, అందరినీ నీ వైపు తిప్పుతా'' అన్నాడు వీర్రాజు. చివర్లో ఓడిపోతానేమోననే భయంతో సుబ్బారావు ఒప్పుకున్నాడు. వీర్రాజు మాట నిలబెట్టుకొన్నాడు. ఓటుకి రెండు వేల ఐదొందలు సాధించాడని వీర్రాజుని అనుచరులంతా మెచ్చుకొన్నారు.

ఇలా ఎన్నికలొచ్చినప్పుడల్లా పోటాపోటీగా డబ్బులు, ఇతర గిఫ్టులు వస్తూనే వుంటాయి అందరికీ. ఒకసారి ఒకే సంవత్సరంలో ఒక్కో కుటుంబానికి రెండు బిందెలు, ఒక కుక్కరు, ఒక గ్యాస్ స్టవ్, రెండు చీరలు, ఇరవై వేల నగదూ

వచ్చాయి ఆ ఏరియాలో. ఇలా పార్లమెంటుకీ, అసెంబ్లీకీ, మునిసిపాలిటీకి, విడివిడిగా ఎన్నికలు రావటం, అలా ప్రతి కుటుంబానికీ సౌకర్యాలు సమకూరటంతో, ఈ విధమైన ప్రజాస్వామ్యం పట్ల వీర్రాజు అనుచరులందరికీ అతని మీద అభిమానం పెరిగిపోయింది.

వీర్రాజుని ఒప్పించడకుండా ఆ ఏరియాలో ఏ పార్టీ కూడా జెండా పాతలేదు. ఇంటింటికీ తిరగలేదు.

అయితే వీర్రాజు ఏమీ సంపాయించుకోలేదు. కాంక్రీటు కప్పున్న ఒక గది, దాని ముందు రేకుల షెడ్డు మొత్తం మూడు సెంట్లలో ఇల్లు. ఒక సైకిల్ షాపు. ఇంట్లో భార్య, తల్లి, కూతురు, కొడుకు ఉంటారు. షాపులో ఇద్దరు సహాయకులుంటారు.

కుటుంబాన్ని ఏమీ పట్టించుకోకుండా పనికిరాని రాజకీయాల్లో తిరుగుతుంటాడని వీర్రాజుని అతని తల్లి అప్పమ్మ ఎప్పుడూ విసుక్కుంటూనే వుంటుంది.

‘మంత్రులనీ, చైర్మన్లనీ తళతళలాడే తెల్ల చొక్కాలేసుకొచ్చిన ప్రతోడి ఎంటా తిరుగుతాడు తిండీతిప్పలు లేకుండా. ఒక్కడైనా వీడి బాగోగులు చూస్తారా? ఎలక్షన్లయి పోయినాక వీడ్ని పట్టించుకొంటారా?'' అంటూ ఇంటికి వచ్చిన వాళ్ళందరి దగ్గర వాపోయేది అప్పమ్మ.

వేరే టైంలో ఎలా ఉన్నా ఎన్నికల టైంలో ఆ ఏరియాలో వీర్రాజు కీలక వ్యక్తి. అలాంటి వ్యక్తి ఎన్నికలు ఇంకా పది రోజులే ఉన్నాయనగా చనిపోవటం అతని అనుచరుల్ని విషాదంలో ముంచెత్తింది.

ఎన్నికలంటే హడావిడి. ఓటర్లకూ వారి కుటుంబాలకూ వచ్చే డబ్బులు, బహుమానాలు ఒక వైపు, వీర్రాజుకీ అతని అనుచరులకీ ప్రతిరోజూ మందూ, బిర్యానీలు, కార్లూ, మీటింగులూ ఒకవైపు. దేశంలో సామాజిక న్యాయానికీ, ఆర్థిక పురోభివృద్ధికి ఇంతకన్నా ఏం నిదర్శనం కావాలనిపిస్తుంది ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా.

వీర్రాజు మరణం, గుణదల ప్రాంతాన్ని ఒక కుదుపు కుదిపినట్లయింది.

‘‘ఎత్తే గ్లాసూ దించే గ్లాసూ. ఇరవై రోజులుగా తాగుతూ, తిరుగుతూనే ఉన్నాడా నిద్రాహారాలు మాని. కాలేయం దెబ్బతిందన్నారు. అయినా వింటేనా? ఒక్కసారిగా భారీగా గుండెపోటు వచ్చిందంట'' అన్నాడొక అనుచరుడు.

‘‘అసలు ఈ ప్రభుత్వాసుపత్రికి ఎందుకు తీసుకొచ్చారురా? ఏదైనా ప్రైవేటు ఆసుపత్రిలో అయితే వెంటనే మంచి ట్రీట్‌మెంట్ దొరికేది కదా'' అన్నాడు ఇంకొకడు.

బెంజ్ సర్కిల్ దగ్గర ఎవరో నాయకుడిని కలిసి తిరిగి వస్తుంటే కార్లోనే వాలిపోయాడనీ, ఏం చేయాలో అర్థం కాక తనతో ప్రయాణిస్తున్న ఇంకో అనుచరుడు వెంటనే ప్రభుత్వాసుపత్రిలో అడ్మిట్ చేశాడనీ, అత్యవసర ట్రీట్‌మెంట్ ఇచ్చినా ఫలితం లేకపోయిందనీ, మళ్ళీ భారీగా గుండెపోటు వచ్చిందని తేల్చేశారు.

అక్కడికి పరుగెత్తుకొంటూ వచ్చిన అనుచరుడు దుర్గారావు తన సెల్ ఫోనులో రంగురంగుల జెండాలుకలిగిన కలిగిన పార్టీలన్నిటికీ సంబంధించిన ప్రాంతీయ నాయకులందరికీ కబురందించాడు.

ప్రభుత్వాసుపత్రిలో జరగాల్సిన కార్యక్రమాలనీ అయిపోయాక వీర్రాజు శవాన్ని అంబులన్స్‌లో ఎక్కిస్తుండగా మళ్ళీ అందరికీ ఫోన్ చేశాడు. ఎవరూ సరిగా బదులు పలుకలేదు.

అప్పటికే ఓ ఏభై మంది అనుచరులు చేరారు. అందరూ ''జై వీర్రాజు, జయహో వీర్రాజు, లాంగ్ లివ్ వీర్రాజు, వీర్రాజు అమర్ రహే'' అనే నినాదాల్తో అంబులెన్స్‌ని అనుసరించారు.

వీర్రాజు శవం ఇంటికి చేరినా కూడా ఏ పార్టీ వాళ్ళూ అక్కడికి ఇంకా రాకపోవటం దుర్గారావుకి కోపం తెప్పించింది.

''బెంజ్ సర్కిల్ దగ్గర ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్లేతో గొడవైంది. ఆ గొడవతోనే వీర్రాజుకి తట్టుకోలేక గుండెపోటు వచ్చింది'' అని ఒకరిద్దరితో అన్నాడు.

అలా అన్నాడు గాని ప్రతిపక్ష ఎమ్మెల్లే ముందుగా అంగీకరించిన డబ్బు ఇవ్వననటంతోనే పేచీ వచ్చి గట్టిగా వాదన జరిగిందనీ, వీర్రాజు కోపంగా తిరిగి వచ్చాడనీ నర్మగర్భంగా ప్రచారం చేశాడు.

ఈ ప్రచారం ప్రతిపక్ష పార్టీ మద్దతుదారుడైన కాంతారావు దాకా వెళ్ళింది. ఇందులో చాలా ప్రమాదం ఉందని పసిగట్టిన కాంత ారావు ఇంకో కొత్త ప్రచారం చేయించాడు.

ప్రతిపక్ష ఎమ్మెల్లే వీర్రాజుకి ఐదు లక్షలు ఇచ్చాడనీ, వీర్రాజు అవి ఎక్కడా పంచకపోవటంతోనే ఎమ్మెల్లే పిలిచి మందలించాడనీ అక్కడే గొడవైందనీ ప్రచారం చేశాడు.

కాంతారావు పురమాయించగానే బేకరీ నడిపే రమేష్ నాలుగు రోడ్ల సెంటర్లో నాలుగు రాళ్ళుపెట్టి ఒక నల్ల జెండా పెట్టి, దానిక్రింద వీర్రాజు ఫోటో, పార్టీ జెండా పెట్టి ''ప్రజానాయకుడు వీర్రాజు అమర్ రహే'' అని వ్రాయించాడు.

ఆగ్రహంతో వూగిపోయిన దుర్గారావు అధికారపార్టీ వాళ్ళందర్నీ పిలిపించి వీరరాజు ఖద్దరు వేషంలో నమస్కారం చేస్తున్నట్లున్న ఫ్లెక్సీలు తయారు చేయించి అందులోనే తమపార్టీ జెండా కూడా ఉండేట్లు, పార్టీ ప్రాంతీయ నాయకుల ఫోటోలు కూడా ఉండేట్లు తయారు చేయించి, గుణదలలోని అన్ని మూలల్లో నిలబెట్టేశాడు.

''శ్రామిక నాయకుడు, నిస్వార్థ ప్రజాసేవకుడు'' అని వ్రాయించాడు.

''అన్నా, నిన్ను మరువలేం... కన్నీళ్ళతో...'' అంటూ తన పేరు కూడా వ్రాసేశాడు ఫ్లెక్సీలో.

సాయంత్రం అయేటప్పటికి ఫ్లెక్సీలన్నీటిలోకి తెలుగు చిత్రసీమలోని యువనాయకులందరూ ప్రవేశించారు. వీరరాజు ఫోటో ప్రక్కన ఒక వర్గం వారు మహేశ్‌బాబు ఫోటో జతచేస్తే, ఇంకో వర్గంవారు తారక్ ఫోటో, ఇంకొకరు రాంచరణ్ ఫోటో, ఇంకొకరు బాహుబలి ఫోటో జతచేస్తే, అలా అన్ని ఫోటోలూ ప్రత్యక్షమయి, శ్రద్ధాంజలి ఎవరికి ఎవరు ఘటిస్తున్నాలో అర్థం కాని పరిస్థితి.

వీరరాజు శవం ఇంటి దగ్గర రేకుల షెడ్ ఖాళీ చేసి ఐస్ బాక్సులో ఉంచారు. రోడ్డుకి రెండు వైపులా షామియానా కట్టి లోపల ఒక వంద కుర్చీలు వేశారు. దీపం దగ్గర కూర్చుని అతని తల్లి దీనంగా రోదిస్తున్నది. కూతురు తండ్రి శరీరంపై పూలదండలు సవరిస్తూ ఉంది.

చీకటి పడేటప్పటికల్లా వీరరాజు చనిపోయాడని ఆ ప్రాంతంలోని ఎమ్మెల్లే, ఎమ్మెల్లేగా పోటీ చేసి ఓడిపోయిన ఇద్దరు నాయకులకూ, వార్డులో పోటీ చేస్తున్న సుబ్బారావుకూ అతని ప్రత్యర్థులకూ అందరికీ తెలిసిపోయింది.

ధనరూపేణా, సహాయం రూపేణా వీరరాజు పై వెచ్చించిందంతా నీరుగారి పోయినందుకు ఒక రకం బాధ వారందర్నీ ఆవరించింది. వారికి వీరరాజు మరణం ఓటర్లకు దగ్గర కావటానికి ఒక మహత్తర అవకాశంగా కన్పించింది.

రాత్రి ఏడింటికి ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్లే వీరరాజు ఇంటికి వచ్చాడు. శవం చుట్టూ తిరిగి పూలమాల వేశాడు. ''సమాజశ్రేయస్సు కోసం ఎంతో కష్టపడ్డ నాయకుడు వీరరాజు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నాను'' అన్నాడు.

''మా నాయకుడి కోసం సంతాప సూచకంగా రేపు దుకాణాలన్నీ బందు చేయిస్తాం. ఉదయం పది గంటలకు అమరుడైన వీరరాజు అంత్యక్రియలకు అంతిమయాత్రకు పార్టీ వాళ్ళందర్నీ రావల్సిందిగా కోరుతున్నాను'' అన్నాడు.

అలా చెప్పే ముందు వీరరాజు కుటుంబాన్ని సంప్రదించలేదతను.

మళ్ళీ ''వీరరాజు అమర్ రహే, జై వీరరాజు, జై జై వీరరాజు'' నినాదాలు అక్కడ మార్మోగాయి.

ఎమ్మెల్లే వెళ్ళిపోయాక అధికారపార్టీ నాయకుడొకడు వచ్చాడు. అధికార పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయినా అన్ని అధికార కార్యక్రమాలకు అతనే ముఖ్య అతిథిగా ఉంటాడు. అతను కూడా శవం చుట్టూ ప్రదక్షిణలు చేశాడు. పూలదండ వేశాడు. వీర్రాజు భార్యతో, తల్లితో ఓదారుస్తున్నట్లుగా ఫోటోలు కూడా దిగాడు. ఇంతలో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్లే అంతకు క్రితమే చేసిన అంతిమయాత్ర ప్రకటన గురించి అతని అనుయాయులు చెప్పారు.

వెంటనే అధికారపార్టీ నాయకుడు ''రేపు ఉదయం జిల్లా మంత్రివర్యులు, ఇతర నాయకులు వచ్చి శ్రద్ధాంజలి ఘటిస్తారు. వీర్రాజు భౌతికకాయాన్ని జిల్లా పార్టీ ఆఫీసులో ప్రజల సందర్శనార్థం ఉంచుతాం. అక్కడ రేపు పన్నెండు గంటలకు సంతాపసభ ఏర్పాటు చేయడం ద్వారా మన ప్రియతమ నాయకుడికి తగిన నివాళి అర్పిస్తాం'' అన్నాడు. ఇతను కూడా వీర్రాజు కుటుంబాన్ని ముందుగా సంప్రదించలేదు.

అంతేకాదు, ఇంకోజాతీయ పార్టీ వాళ్ళు శివుడి బొమ్మతోనూ, విభూతితోనూ వచ్చి, వీర్రాజు శవానికి కాళ్ళ దగ్గర పూలదండను ఉంచి నమస్కరించి వెళ్ళారు. అప్పటికే వాళ్ళు లొకాలిటీలో వినాయకుడి గుడి దగ్గర, రామాలయం దగ్గర నల్ల జెండాలు పాతి శివుడి బొమ్మనూ క్రింద వీర్రాజు బొమ్మనూ ఉండేటట్లుగా ఫ్లెక్సీలు పెట్టేశారు. ''సంప్రదాయాలకు, సంస్కృతికి విలువనిచ్చి జీవించిన నాయకుడా నీకు మరణం లేదు'' అని కాషాయం అక్షరాల్లో వ్రాసి పెట్టారు.

ఉద్యమ పార్టీ వాళ్ళయితే ఒక ఎర్ర జెండా తెచ్చి శవం మీద కప్పి రెడ్ శాల్యూట్ చేసి ''కామ్రేడ్ వీర్రాజు అమర్ రహే'' అని అరుస్తూ వెళ్ళారు.

ఈ నాయకులంతా వచ్చి దండలు వేస్తున్నప్పుడు, ఐస్ బాక్స్‌లో వీర్రాజు చిరునవ్వు నవ్వుకుంటున్నట్లుగా అనిపించేది అతని కూతూరు స్వరాజ్యానికి. అతని కొడుకు రవికి మాత్రం వాళ్ళందర్నీ తరిమి తరిమి కొట్టాలన్నట్లుగా ఉండేది.

ఇంతలో బేకరీ రమేష్ వచ్చి తదుపరి మరణానంతర తతంగం ఎలా నిర్వహించాలని అప్పమ్మను అడుగుతున్నాడు.

''సంసారాన్ని నట్టేట ముంచి నా కొడుకు ఎలాగూ పోయాడు. ఈ సచ్చినోళ్ళందరి వల్లే నా కొడుకు ఈ వయసులో పోయాడు. నాకు ఏ పార్టీ వాళ్ళూ వద్దు. మహాప్రస్థానం అంబులెన్స్ తెప్పించండి. ఉదయం ఎనిమిది గంటలకే శ్మశానానికి తీసుకెళ్ళండి. ఈ లంజాకొడుకుల్నించి నా కొడుకు శవాన్నయినా కాపాడండి'' కోపంగా తేల్చేసింది అప్పమ్మ. వీర్రాజు కొడుకు కళ్ళు దుఃఖంతో ఎర్రబడ్డాయి.

''అది కాదే అప్పమ్మత్తా. వీర్రాజు జీవితమంతా జనంతోనే గడిపాడు. అతని అంతిమయాత్ర కూడా జనం మధ్యనే జరిగితే అతని ఆత్మ శాంతిస్తుంది. నువ్వు అభ్యంతరం పెట్టొద్దు'' అప్పమ్మ ప్రక్కనే కూర్చుని బ్రతిమాలాడు కాంతారావు.

ఆమె దగ్గరకు వెళ్ళి ఓదారుస్తున్నట్లుగా ''ఒప్పుకో అప్పమ్మత్తా. నీ కుటుంబానికి ఏమీ మిగలలేదు. పార్టీ వాళ్ళతో ఒక ఐదు లక్షలు ఇప్పిస్తా. ప్రతిపక్ష పార్టీ వాళ్ళను చేసుకోనియ్'' అని రహస్యంగా చెప్పాడు.

అనాథలైన కోడలు, పిల్లల భవిష్యత్ గురించి భయపడుతున్న అప్పమ్మ ఆలోచనలో పడింది. అది గమనించిన కాంతారావు ''ఒక అరగంటలో డబ్బు పంపిస్తా''నని చెప్పి వెళ్ళిపోయాడు అప్పమ్మ మౌనంగానే అంగీకరించింది.

కాంతారావు డబ్బు పంపాడో లేదో ఆ ప్రాంతమంతా ప్రతిపక్షపార్టీ రంగు మయం అయిపోయింది. బ్యానర్లు, ఫ్లెక్సీలు, బజార్లన్నీ ఆపార్టీ రంగుబట్ట చుట్టిన శవాల్లా కన్పిస్తున్నాయ్.

దుర్గారావుకు ఇదంతా తెలిసేటప్పటికి కొంచెం సమయం పట్టింది. గతంలో ఎమ్మెల్లేగా పోటీ చేసి ఓడిపోయిన నాయకుణ్ణి తీసుకుని వీర్రాజు తల్లి దగ్గరకు వచ్చాడు. అంతిమయాత్ర అధికారపార్టీ తరపున చేస్తామని, అధికార పార్టీ అండగా ఉంటుందనీ ప్రాధేయపడ్డాడు. కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్న శంకర్ అయితే శవం చుట్టూ పొర్లు దండాలే చేశాడు. ఆమెకు సాష్టాంగ ప్రణామం చేశాడు. అదేమీ పట్టించుకోకుండా అంతకు ముందే ఒప్పేసుకున్నానని చెప్పింది అప్పమ్మ.

ఇక అప్పమ్మను ఒప్పించటం కష్టం అని గమనించిన 'ఓడిపోయిన నాయకుడు' ఇంకొక ప్రతిపాదన చేశాడు.

వీర్రాజుకు శ్మశానం దగ్గరే తమ పార్టీ తరపున సంతాపసభ ఏర్పాటు చేస్తామనీ అందుకైనా అమమతించమని వేరుకొన్నాడు. దుర్గారావు చేత రహస్యంగా ''అంతిమయాత్ర ముగియగానే డెడ్‌బాడీని తమకిచ్చేయాలనీ, శ్మశానంలో కార్యక్రమాలన్నీ పార్టీ తరపున చేయటమే కాకుండా వెంటనే సంతాపసభ కూడా దగ్గరి కూడలిలోనే జరుపుతామనీ, ఒప్పుకుంటే పార్టీ చేత పది లక్షలు ఇప్పిస్తా''నని చెప్పించాడు.

చనిపోయిన కొడుకు మీద ప్రేమ, దుఃఖం ఒకేసారి పెల్లుబికాయి అప్పమ్మలో. ఎన్నికల మీద, ప్రజాస్వామ్యం మీదా, మొత్తంగా భారతదేశం మీద అవ్యాజమైన ప్రేమ పెల్లుబికింది ఆమెలో. ''సరే. అంతిమయాత్ర శ్మశానం దాకా రాగానే మీదే బాధ్యత'' అని ఒప్పేసుకుంది. మరో అరగంటలో పది లక్షలు ఆమెకు చేరాయి.

ఎవరూ సరిగా నిద్రపోకుండానే తెల్లవారింది. ఎవరో లౌడ్ స్పీకర్‌లో భగవద్గీత పెట్టారు. ''యదాయదాహి ధర్మస్య'' అని అందులో ఘంటసాల పాడుతూంటే, ఉదయం ఎనిమిది గంటలకే 'ప్రజానాయకుడు', 'పేదల పెన్నిధి', 'గుణదల దళితనేత', 'వీర్రాజు అమర్ రహే', 'వీర్రాజు జోహర్', 'జోహార్ వీర్రాజు' అంటూ నినాదాలు మిన్నంటుతున్నాయ్.

వీధులన్నీ ఫ్లెక్సీలతో, బ్యానర్లతో ప్రతిపక్షపార్టీమయమై పోగా, శ్మశానం చుట్టూరా ఉన్న ఏరియా పూర్తిగా అధికారపార్టీరంగుతోనిండిపోయింది.

ఓపెన్ ట్రక్ మీద శవాన్ని పడుకోబెట్టారు. వీర్రాజు కొడుకు ప్రక్కనే అమాయకంగా నిల్చున్నా అతని కళ్ళు రక్తం గడ్డకట్టినట్లు క్రోధంగా చూస్తున్నాయ్. ఫుల్లుగా నాటు సారా తాగిన లెనిన్, వీర్రాజు శవానికి ముఖం మీద పూలు పడకుండా తూలుతూ తుడుస్తున్నాడు. అలాగే బాగా తాగేసిన బోసూ, స్టాలినూ, జవహర్ పొడుగైన బొట్లు పెట్టుకొని కారాకిళ్ళీ నములుత్తూ శవానికి రెండు వైపులా నిల్చుని పూలు చల్లుతుండగా యాత్ర బయలుదేరింది.

జోహార్ వీర్రాజు

జోహార్ జోహార్

అమర్ రహే వీర్రాజు

అమర్ రహే అమర్ రహే

వాహనం చుట్టూ పోలీసులు కంగారుగా నడుస్తున్నారు. ఏ రౌడీ గ్యాంగ్ వాళ్ళో గొడవ చేస్తారని వాళ్ళ కంగారు.

ఈలోపు వాహనం శ్మశానం దగ్గరికి వచ్చింది. అప్పటికే అక్కడకు చేరిన అధికారపార్టీ నాయకులు అప్పమ్మ మాట మీద అంగీకారం ప్రకారం శవాన్ని తమకివ్వాల్సిందేనని పట్టుబట్టారు.

''ప్రతిపక్ష పార్టీ నాయకుడు వీర్రాజు జోహార్'' అని ఒకరంటే ''అధికారపార్టీ నాయకుడు వీర్రాజు అమర్ రహే'' అని ఇంకొకరు. నినాదాల హోరులో శవాన్ని దించేసి ట్రక్కు వాడు వెళ్ళిపోయాడు.

శవం రోడ్డు మీదనే ఉంది

ఎండ వేడి పెరిగిపోతూ వుంది.

అక్కడే షామియనా వేసి ఎదురుచూస్తున్న అధికారపార్టీ నాయకులు శవాన్ని షామియానా లోనికి తీసుకుపోవాలని ప్రయత్నిస్తే, ప్రతిపక్ష పార్టీ నాయకులు తీవ్రంగా ప్రతిఘటించారు.

ఎవరో వెళ్ళి అప్పమ్మను ప్రార్థించారు ప్రతిష్టంభన తొలగించమని.

''నా కొడుకు ఎలానూ పోయాడు. తిరిగిరాడు. ఇంకా ఎంతమంది ఎలా చస్తే నాకేంటి?' అనుకొంటూ, తన దగ్గర ఉన్న పదిహేను లక్షల డబ్బును రహస్య ప్రాంతంలో దాచుకుంది.

శవం దగ్గర కొట్లాట తీవ్రమైంది. అటూ ఇటూ శవాన్ని లాగటంతో పాడె కట్టిన తాడు విడిపోయి శవం రోడ్డు మీద దీనంగా పడివుంది.

రెండు వర్గాల నాయకుల అనుచరుల కొట్లాట ఇంకా ఎక్కవమంది చేరటంతో బజారంతా వ్యాపించి దూరం దూరం జరిగి రాళ్ళు రువ్వుకొనే దాకా వెళ్ళింది. బూతు పురాణాలు, రంకు పంచాంగంతో అరుపులు, పరస్పర దూషణలు మిన్నంటినయ్. అందరూ వదిలేసి, దీనంగా పడి వున్న శవం దగ్గర నాలుగు కుక్కలు చేరినయ్. ఒకటి శవాన్ని వాసన చూస్తున్నది. ఇంకొకటి ముందు కాలితో గీరుతున్నది. ప్రక్కనే అసహాయుడిగా ఉన్న వీర్రాజు కొడుకు ఒక కర్ర తెచ్చి కుక్కల్ని తరిమాడు. శవాన్ని ఒక్కడే శ్మశానంలోకి తీసుకెళ్లాలని ప్రయత్నించాడు. వల్ల కాలేదు. బాధలో కోపంలో పరిగెత్తుకుంటూ వెళ్ళి చుట్టుప్రక్కల పడిపోయి, కొట్లాటలో చినిగిపోయిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, కర్రలు అన్నీ తెచ్చి శవం మీద పేర్చాడు. అవన్నీ వీర్రాజు శవం కనిపించనంతగా గుట్టగా ఏర్పడ్డాయ్.

కుక్కలు దూరం నుంచి అరుస్తున్నాయ్.

వీర్రాజు కొడుకు నీటికుండతో శవం చుట్టూ తిరిగి అగ్గిపుల్ల గీసి గుట్టపై వేశాడు. మంట బాగా రగులుకుంది. అన్నిపార్టీల బ్యానర్లూ, ఫ్లెక్సీలు, కర్రలూ బాగా మండుతున్నయ్. ఆ మంటల్లో వీర్రాజు శవం దహించుకుపోయింది అతని కొడుకు దుఃఖంలాగే.

ఎరుపు, పసుపు, నీలం, కాషాయం ఇంకా ఎన్నో రంగుల్లో ఎగసిన మంటలు చూసి కుక్కలు పారిపోయాయి.

వీధిలోనే దహనం చేయబడ్డ వీర్రాజు రంగురంగుల మంటల్లోంచి తెల్లటి బూడిదైపోయాడు.

★★★★★

COMMENTS